క్లుప్తంగా

ఆసుపత్రి గేటు వద్ద ట్రాఫిక్ నియంత్రించాలి



ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్‌కు వినతి పత్రం ఇస్తున్న సాయిప్రదీప్

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఇన్ గేటు వద్ద ట్రాఫిక్‌ను నియంత్రించాలని ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు పిటి.సాయిప్రదీప్ శుక్రవారం ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్‌కు వినతి పత్రం సమర్పించారు. ప్రధానంగా ఎన్‌టీఆర్ సర్కిల్ వద్ద రద్దీగా ఉంటోందని, ఇలాంటి పరిస్థితుల్లో ఆసుపత్రి గేటు వద్ద ట్రాఫిక్‌తో మరింత ఇబ్బందులు ఉన్నాయన్నారు. గేటు ముందు ఆటోలు, వ్యాపారులు అడ్డంగా ఉండటంతో లోపలికి వాహనాలు వెళ్లేందుకు వీలు లేకుండా ఉంటోందన్నారు. ఈ మేరకు గేటు ముందు ట్రాఫిక్ పోలీసులను ఏర్పాటు చేసి సమస్య పరిష్కరించాలని కోరారు.

సమ్మెను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న విజయ రామాంజనేయులు

కర్నూలు(సెంట్రల్): జూలై 9వ తేదీన దేశ వ్యాప్తంగా జరిగే సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ నగర కార్యదర్శి విజయరామాంజనేయులు పిలుపునిచ్చారు. శుక్రవారం సుర్జీత్ భవన్‌లో ఏర్పాటు చేసిన ఆటో కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని, రవాణా శాఖ కార్యాలయాలను ప్రైవేట్‌కు అప్పగించరాదన్నారు. ఆటోమేటిక్ టెస్టింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయరాదన్నారు.సెన్సార్ ఫిట్‌నెస్ ట్రాకులను వెంటనే రద్దు చేయాలన్న ఉద్దేశంతో చేపట్టే జాతీయ సమ్మెకు మద్దతు ఇవ్వాలని ఆటో కార్మికులను కోరారు. కార్యక్రమంలో నాగరాజు, రవి. పి.మహ్మద్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఇద్దరికి గాయాలు




గాయపడిన మల్లికార్జున, పరశప్ప

ఆదోని అర్బన్: ఆస్పరి మండలం చిన్నహోతూరు గ్రామంలో ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడంతో ఆర్పేందుకు వెళ్లిన ఇద్దరికి శుక్రవారం గాయాలయ్యాయి. బాధితులు, ఔట్‌పోస్టు కానిస్టేబుల్ తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన మల్లికార్జున, పరశప్ప గ్రామంలో ట్రాన్స్‌ఫార్మర్‌కు మంటలు చెలరేగడంతో ఆర్పేందుకు వెళ్లగా విద్యుత్‌షాక్‌కు గురై గాయాలపాలయ్యారు. స్థానికులు వెంటనే ఆదోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు



జేఎం తండాలో బిందెల్లో నిల్వ చేసిన బెల్లం ఊటను చూపుతున్న ఎక్సైజ్ అధికారులు

తుగ్గలి : జిల్లా ఏఈఎస్ ఈఎస్‌టీఎఫ్ అధికారి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఏసీ ఎన్‌ఫోర్స్‌మెంట్, పత్తికొండ సీఐ సువర్ణలత, ఎస్ఐ సాయిప్రవీణ్, సిబ్బంది శుక్రవారం నాటు సారా స్థావరాలపై దాడులు నిర్వహించారు. పత్తికొండ మండలం జేఎం తండాలో 1,150 లీటర్ల బెల్లం ఊట, తుగ్గలి మండలం లక్ష్మితండాలో 450 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేశారు. ఈ మేరకు ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ ఎస్ఐ తెలిపారు. దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ జయరాముడు, ఎస్ఐ తేజ పాల్గొన్నారు.

వేలంలో రూ.8.69 లక్షల ఆదాయం



వేలం నిర్వహిస్తున్న ఆలయ అధికారులు

నందవరం: గురజాల రామలింగేశ్వరస్వామి క్షేత్రంలో శుక్రవారం ఈఓ రాంప్రసాద్, పర్యవేక్షణ అధికారి సాయి ఆధ్వర్యంలో ఆలయ భూములకు వేలం నిర్వహించారు. గ్రామానికి చెందిన రైతులు పరమేష్, ఈశ్వర్‌రెడ్డి, యల్లప్ప, హనుమంతు, రాముడు, జయరాముడు, నరసింహులు రూ.5 వేలు డిపాజిట్ చెల్లించి వేలం పాటలో పాల్గొన్నారు. హనుమంతు, యల్లప్ప, రాముడు, జయరాముడు, పరమేష్, ఈశ్వర్‌రెడ్డి హెచ్చుగా పాడి ఆలయ భూములను కౌలుకు దక్కించుకున్నారు. గురజాల రామలింగేశ్వర స్వామి ఆలయ భూములకు సంబంధించి 94.26 ఎకరాలకు వేలం నిర్వహించగా రూ.8.69 లక్షల ఆదాయం సమకూరినట్లు ఈఓ తెలిపారు. గ్రామ పెద్దలు నరసింహారెడ్డి, శివారెడ్డి, రాజేష్‌రెడ్డి, చిన్న నరసింహులు పాల్గొన్నారు.

గీత దాటితే కిసిక్కే!

- రోడ్డు నిబంధనల ఉల్లంఘనులపై నిఘా నేత్రాలు
- నగరంలోని ముఖ్య కూడళ్లలో ఆటోమేటిక్ సిగ్నల్ వ్యవస్థ
- నిబంధనలు అతిక్రమిస్తే భారీగా జరిమానా



నగరంలో ఏర్పాటు చేసిన ఆటోమేటిక్ సిగ్నలింగ్ వ్యవస్థ

కర్నూలు: ముఖ్య కూడళ్లలో ఎరుపు రంగు లైటు వెలిగినా పోలీసులు లేరు కదా అని ముందుకు పోతే ఇకపై మీకు కష్టాలే. ట్రాఫిక్ పోలీసులు ఆపుతుంటే హడావుడిగా సీటు బెల్టు పెట్టుకుంటున్నారా? సీటు బెల్టు పెట్టుకోకుండా ఏదైనా కూడలి దాటారా? మీ జేబులకు చిల్లు పడుతుంది. హెల్మెట్ ధరించకుండా రోడ్డు మీదకు వచ్చారా.. ఇకపై మీకు ఇబ్బందులు తప్పవు. ఇదెలా సాధ్యమనుకుంటున్నారా.. కర్నూలు నగరంలో ప్రధాన కూడళ్లలో ఆటోమేటిక్ సిగ్నలింగ్ వ్యవస్థతో నిఘా పెట్టారు. దీని కోసం ప్రత్యేకంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ సిగ్నల్స్ ఉన్న కూడళ్లలో ఆర్ఎల్‌వీడీ (రెడ్ లైట్ వయోలేషన్ డిటెక్షన్) సిస్టమ్ అమలులోకి వచ్చింది. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే వాహనం నంబర్ గుర్తించి ఈ-చలానా నమోదు చేస్తుంది. నూతన మోటర్ వాహన చట్టం ప్రకారం ఇప్పటికే తనిఖీల ద్వారా ట్రాఫిక్ పోలీసులు భారీ జరిమానాలు విధిస్తున్నారు. పోలీసుల కళ్లు గప్పి తిరుగుతున్న వాహనదారులను కట్టడి చేసేందుకు ఈ వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్ ప్రకటించారు.

అందరూ పాటించాల్సిందే

ట్రాఫిక్ నిబంధనలు ప్రతి ఒక్కరూ కచ్చితంగా అమలు చేసేందుకు ఆటోమేటిక్ సిగ్నలింగ్ వ్యవస్థ అందుబాటులోకి వచ్చింది. నగరంలోని రాజ్‌విహార్, పాత కంట్రోల్ రూమ్ సెంటర్, పంప్ హౌస్, వెంకటరమణ కాలనీ, ఐదు రోడ్ల కూడలి, సి.క్యాంప్ సెంటర్, నంద్యాల చెక్‌పోస్టు ప్రాంతాల్లో ఆటోమేటిక్ సిగ్నలింగ్ వ్యవస్థతో నిఘా ఏర్పాటు చేశారు. కర్నూలు నగరంలో 13 చోట్ల సిగ్నల్ లైట్లు ఏర్పాటు చేయగా ఏడు చోట్ల ఆటోమేటిక్ సిగ్నలింగ్ వ్యవస్థతో నిఘా ఏర్పాటు చేశారు. మిగిలిన ప్రాంతాల్లో కూడా పనులు సాగుతున్నట్లు సమాచారం. ఆటోమేటిక్ సిగ్నలింగ్ వ్యవస్థ ద్వారా మూడు రోజుల్లో దాదాపు వెయ్యి వాహనాలకు పైగా ఈ-చలానాల ద్వారా జరిమానాలు నమోదయ్యాయి. అన్ని రకాల ఉల్లంఘనులను ఇది గుర్తిస్తుంది. కూడలిలో రెడ్ సిగ్నల్ పడినప్పుడు తెలుపు రంగు లైన్ దాటితే చాలు వివరాలు నమోదు చేస్తుంది. వెంటనే ఈ-చలానా పడుతుంది. అదే తరహా ఇతర ఉల్లంఘనులపై నిఘా పెడుతుంది.

భారీ జరిమానాలు..

నూతన మోటర్ వాహనాల చట్టం ప్రకారం కొత్త జరిమానాలను మార్చి 1 నుంచే అమలు చేస్తున్నారు. ఆటోమేటిక్ సిగ్నలింగ్ వ్యవస్థ ద్వారా నమోదు చేసిన కేసుల్లోనూ ఇవే జరిమానాలు ఈ-చలానా రూపంలో పడతాయి. ఒకే ఉల్లంఘన పదేపదే చేస్తుంటే జరిమానా పెరిగిపోతుంది. అవసరమైతే డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేసే అవకాశముంది.

వేధిస్తున్న సిబ్బంది కొరత

కర్నూలు నగరంలో ట్రాఫిక్ నియంత్రణకు కనీసం వంద మంది సిబ్బంది అవసరం కాగా, ప్రస్తుతం 60 మంది మాత్రమే ఉన్నారు. వీరితోనే ట్రాఫిక్ నియంత్రణ మూడు షిఫ్టుల్లో నిర్వహిస్తున్నారు. నగరంలో మొత్తం 20 ట్రాఫిక్ పాయింట్లు ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లో నిరంతరం విధులు నిర్వహించాల్సి ఉన్నప్పటికీ సిబ్బంది కొరత వల్ల పాతబస్తీతో పాటు మరికొన్ని ప్రాంతాల్లో సిబ్బంది లేకపోవడం వల్ల ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి.



ఆటోమేటిక్

చలానా చెల్లించకపోతే వాహనం జప్తు



ఆటోమేటిక్ సిగ్నలింగ్ వ్యవస్థ ద్వారా నమోదైన ఈ-చలానాలు సకాలంలో చెల్లించకపోతే తనిఖీల్లో వాహనం జప్తు చేయడం ఖాయం. నగర ప్రజలు ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించకుండా సిగ్నల్స్ వద్ద నిబంధనలు పాటించాలి.

– మన్సూరుద్దీన్, ట్రాఫిక్ సీఐ

నేడు విద్యుత్ కోతలు

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు నగరంలో విద్యుత్ సబ్ స్టేషన్లు, లైన్ల మెయింటెనెన్స్ పనులు చేపడుతున్నందున శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అర్బన్ డీఈఈ నాగప్రసాద్ తెలిపారు. రెండవ శనివారం సెలవు దినమైందున నగరం మొత్తంగా నిర్వహణ పనులు చేపడుతున్నందున ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ కోతలు ఉంటాయని పేర్కొన్నారు. నగర ప్రజలు సహకరించాలని కోరారు.

14న యోగా కార్యక్రమాలు

కర్నూలు(సెంట్రల్): జిల్లావ్యాప్తంగా గుర్తించిన వేదికల్లో ఈ నెల 14న యోగా కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ ద్వారా యోగాంధ్ర నిర్వహణపై జిల్లా అధికారులు, ఆర్‌డీఓలు, మండల స్పెషల్ అధికారులు, మునిసిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, తహసీల్దార్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జూన్ 21న నిర్వహించే యోగా కార్యక్రమంలో జిల్లా నుంచి 10.65 లక్షల మంది పాల్గొనున్నట్లు చెప్పా రు. ఇందులో భాగంగా జూన్ 14న రిజిస్ట్రేషన్ చేసుకున్న వారితో యోగా ప్రదర్శనలు చేయాలన్నారు. జూన్ 17న కర్నూలులోని అవుట్‌డోర్ స్టేడియంలో 5 వేల మంది పారిశుద్ధ్య కార్మికులతో యోగా కార్యక్రమం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని కమిషనర్ రవీంద్రబాబును ఆదేశించారు. టెలీ కాన్ఫరెన్స్‌లో జేసీ డాక్టర్ బి.నవ్య, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, ఆర్‌డీఓలు భరత్‌నాయక్, సందీప్‌కుమార్, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, సెట్కూరు సీఈఓ వేణుగోపాల్ పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట

- నగర పాలక మేయర్ బీవై రామయ్య
- 27 తీర్మానాలకు స్టాండింగ్ కమిటీ ఆమోదం
- రూ.7.42 కోట్లతో అభివృద్ధి పనులకు గ్రీన్ సిగ్నల్



నగర పాలక స్టాండింగ్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ బీవై రామయ్య

కర్నూలు (టౌన్): నగరంలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు మేయర్ బీవై రామయ్య అన్నారు. శుక్రవారం సాయంత్రం స్థానిక నగర పాలక కార్యాలయంలో స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. మేయర్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో కమిషనర్ ఎస్.రవీంద్రబాబు, సభ్యులు, అధికారులు హాజరయ్యారు. మొత్తం 27 తీర్మానాలకు సంబంధించి రూ.7.42 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు స్టాండింగ్ కమిటీ ఆమోదం తెలిపింది. ఈ సమావేశంలో సభ్యులు జుబేర్, యూనుస్, విక్రమసింహా రెడ్డి, మిద్దె చిట్టెమ్మ, అదనపు కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్ రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ విశ్వేశ్వర్ రెడ్డి, ఆర్ఓ జునైద్, అకౌంట్స్ ఆఫీసర్ చుండి ప్రసాద్ పాల్గొన్నారు.

ఆమోదించిన తీర్మానాల్లో కొన్ని...

- రూ.49 లక్షలు సాధారణ నిధులతో ప్రధాన కూడళ్లలో వార్నింగ్ సైన్ బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు, రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటుకు అనుమతి
- సీనియర్‌అసిస్టెంట్లుగా సబార్డినేట్ సర్వీస్ రూల్స్ మేరకు ఎం.డి.ఫరూక్, అహ్మద్, శ్రీనివాసులు, సుహైల్ అహ్మద్‌లకు పదోన్నతి కల్పిస్తూ ఆమోదం.
- రూ.33 లక్షలతో 4వ వార్డులోని కుమ్మరి వీధిలో మేజర్ డ్రైన్ నిర్మాణం
- వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ నుంచి పోస్టాఫీస్ వరకు రూ.22 లక్షలతో డ్రైనేజీ నిర్మాణం
- రూ.22 లక్షలతో 8వ వార్డులోని పెద్ద పడఖానాలో పబ్లిక్ టాయిలెట్ల నిర్మాణానికి అనుమతి
- 12వ వార్డులో రూ.25 లక్షలతో మురుగు కాలువ నిర్మాణం
- 44వ వార్డు బాలాజీ బ్యాంగిల్స్ షాపు నుంచి రూ.17 లక్షలతో సీసీ డ్రైన్ నిర్మాణానికి అనుమతి. ఇదే వార్డులో మున్సిపల్ ఎంప్లాయీస్ కాలనీ పార్కు వద్ద రూ.24 లక్షలతో సీసీ డ్రైన్ నిర్మాణం.
- 48వ వార్డు ఎస్‌వీఆర్ హోటల్ వద్ద రూ.30.60 లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణం. ఇదే వార్డులోని అమీర్ హైదర్‌ఖాన్ నగర్‌లో రూ.37.60 లక్షలు, రూ.19.90 లక్షలు, రూ.46 లక్షలతో వరుసగా సీసీ రహదారుల నిర్మాణం
- 52వ వార్డు సాయిబాబా సంజీవయ్య నగర్‌లో రూ.36.80 లక్షలతో సీసీ రహదారి విస్తరణ పనులకు అనుమతి
- 28వ వార్డు పందిపాడు పరిధిలోని బీఆర్ రెడ్డి కాలనీలో రూ.49.80 లక్షలతో సీసీ డ్రైన్ నిర్మాణం
- 35వ వార్డు ఉమామహేశ్వర నగర్‌లో రూ.42 లక్షలతో డబ్ల్యూబీఎం రోడ్డుకు అనుమతి, ఇదే వార్డులో ఇండస్ట్రియల్ ఎస్టేట్ వద్ద రూ.25 లక్షలతో బీటీ రహదారి నిర్మాణం
- 40వ వార్డు బాలాజీ నగర్‌లో రూ.34 లక్షలతో సీసీ డ్రైన్ నిర్మాణం
- వీధి కుక్కల కుటుంబ నియంత్రణ ఆపరేషన్లకు సహోదయ వెట్ సొసైటీకి రూ.24.29 లక్షలు చెల్లించేందుకు ఆమోదం
- 2025–2026 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మార్కెట్లు, పార్కింగ్ స్థలాలను రోజువారీ లీజుకు ఇచ్చేందుకు అనుమతి
- ఇండోర్ స్టేడియం, క్రికెట్, టెన్నిస్ కోర్టు, స్కేటింగ్ కోర్టులకు సంబంధించి లీజుదారుల లీజు హక్కును రద్దుపరుస్తూ బహిరంగ వేలం ద్వారా లీజు నిర్వహణ బాధ్యతలు అప్పగించేందుకు ఆమోదం
- ఐటీసీ కంపెనీకి ఎదురుగా కృష్ణానగర్ ఫ్లై ఓవర్ వద్ద స్థానిక కార్పొరేటర్ అభ్యర్థన మేరకు వెండర్ జోన్‌ను మరో 3 సంవత్సరాలు లీజుకు ఇస్తూ అనుమతి
- 19వ వార్డు మదర్ ల్యాండ్‌లో రూ.49.50 లక్షలతో బీటీ రహదారి నిర్మాణానికి అనుమతి
- 20వ వార్డు సనత్ నగర్‌లోని వేంకటేశ్వర స్వామి ఆలయ సమీపంలో రూ.35 లక్షలతో సీసీ డ్రైన్ నిర్మాణం. ఇదే వార్డు వాసవీ నగర్‌లో రూ.15 లక్షలతో పైప్‌లైన్ నిర్మాణ పనులకు అనుమతి.
- రాజ్‌విహార్ సమీపంలోని సుంకులమ్మ దేవాలయం నుంచి బుధవారపేట బ్రిడ్జి వరకు హంద్రీ తీరాన ఒడ్డును పటిష్టపరిచేందుకు రూ.50 లక్షలు మంజూరు చేస్తూ అనుమతి.

బదిలీ ఉద్యోగులకు సన్మానం



బదిలీ అయిన ఉద్యోగులను సన్మానిస్తున్న డీవీఎం లక్ష్మీనారాయణ

కర్నూలు కల్చరల్: ఆంధ్రప్రదేశ్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీటీడీసీ) కర్నూలు డివిజన్ నుంచి విజయవాడ హెడ్ ఆఫీస్‌తో పాటు, పలు డివిజన్‌లకు బదిలీ అయిన ఉద్యోగులకు ఘనంగా వీడ్కోలు పలికారు. శుక్రవారం వీఆర్ కాలనీలోని హరిత రెస్టారెంట్‌లో జరిగిన వీడ్కోలు కార్యక్రమంలో కర్నూలు డివిజన్ కార్యాలయం నుంచి విజయవాడ హెడ్ ఆఫీస్‌కు బదిలీ అయిన అకౌంట్స్ మేనేజర్ సి.రామకృష్ణ, ఇంజినీరింగ్ సెక్షన్‌కు బదిలీ అయిన అసిస్టెంట్ ఇంజినీర్ తమ్మిశెట్టి కుమార్, కర్నూలు హరిత హోటల్ యూనిట్ నుంచి విజయవాడ డివిజన్ సూర్యలంక హరిత బీచ్ రిసార్ట్స్‌కు బదిలీ అయిన మేనేజర్ బి.సతీష్‌కుమార్, కర్నూలు డివిజన్ బెలుం కేవ్స్ నుంచి నెల్లూరు డివిజన్ వల్లూరు బోటింగ్ యూనిట్‌కు బదిలీ అయిన అసిస్టెంట్ మేనేజర్ కె.అమర్‌నాథ్ రెడ్డిలను ఏపీటీడీసీ డివిజనల్ మేనేజర్ లక్ష్మీనారాయణ, ఇతర ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. అసిస్టెంట్ ఇంజినీర్ నారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కర్నూలు డివిజన్ డిప్యూటీ మేనేజర్ కె.సువర్ణకుమారి, అసిస్టెంట్ మేనేజర్ పెంచల్ రెడ్డి, శ్రీశైలం మేనేజర్ పవన్, ఓర్వకల్ మేనేజర్ జీవన్, గార్గేయపురం యూనిట్ మేనేజర్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

జొన్నగిరిలో చోరీ

తుగ్గలి : తాళం వేసిన ఇంట్లోకి చొరబడి బంగారు, వెండి ఆభరణాలు, నగదు ఎత్తుకెళ్లిన ఘటన మండలంలోని జొన్నగిరి గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన పార్థయ్యశెట్టి కుటుంబ సభ్యులతో కలిసి ఈనెల 11న మంత్రాలయం పుణ్యక్షేత్రానికి వెళ్లారు. ఇంటికి తాళం వేసి ఉండటంతో గుర్తు తెలియని దుండగులు తాళం పగులగొట్టి బీరువాలో ఉన్న బంగారం, వెండి ఆభరణాలు, నగదును ఎత్తుకెళ్లారు. మంత్రాలయం నుంచి తిరిగి 12న రాత్రి ఇంటికి వచ్చిన పార్థయ్య..బీరువా తెరిచి ఉండటంతో చోరీ జరిగినట్లు గుర్తించారు. అయితే చోరీ ఎంత జరిగిందనేది స్పష్టత రాలేదు. చోరీ విషయాన్ని పోలీసులకు తెలియజేయడంతో పత్తికొండ రూరల్ సీఐ పులిశేఖర్, జొన్నగిరి ఎస్ఐ మల్లికార్జున శుక్రవారం ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఈ మేరకు పోలీసులు విచారణ చేపట్టారు.

విమాన ప్రమాద మృతులకు నివాళి



కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు

కర్నూలు (సెంట్రల్): అహ్మదాబాద్ సమీపంలో జరిగిన విమాన ప్రమాదంలో మరణించిన వారికి జిల్లా కాంగ్రెస్ కమిటీ కొవ్వొత్తులతో నివాళులర్పించింది. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ ఎదుట మహాత్మాగాంధీ విగ్రహం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ సుధాకర్ బాబు, పీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి దామోదరం రాధాకృష్ణ, సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు షేక్ జిలానీ బాషా మాట్లాడుతూ.. కనీవినీ ఎరుగని రీతిలో విమాన ప్రమాదం జరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. విమానం మెడికల్ హాస్టల్‌పై కూలడంతో వైద్య విద్యార్థులు మృతి చెందడం దిగ్భ్రాంతికరమని పేర్కొన్నారు. మరణించిన వారి ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటూ కొవ్వొత్తులతో నివాళులర్పించారు. కాంగ్రెస్ నాయకులు అనంతరత్నం మాదిగ, మహేంద్ర నాయుడు, బతుకన్న, బజారన్న, షేక్ ఖాజా హుసేన్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు, బొలెరో ఢీ

- ముగ్గురికి గాయాలు
- బస్సు డ్రైవర్ అప్రమత్తతతో తప్పిన పెను ప్రమాదం



పొలాల్లోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు



బస్సును ఢీకొని కంపచెట్లలోకి దూసుకెళ్లిన బొలెరో వాహనం

కోడుమూరు రూరల్: ఆర్టీసీ బస్సు, బొలెరో వాహనం ఎదురెదురుగా ఢీకొనడంతో ముగ్గురికి గాయాలైన సంఘటన శుక్రవారం సాయంత్రం కర్నూలు రోడ్డులోని మార్కాపురం బస్ స్టేజీ వద్ద చోటు చేసుకుంది. ఘటనకు సంబంధించి వివరాలు.. ఎమ్మిగనూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు కర్నూలు నుంచి ప్రయాణికులతో ఎమ్మిగనూరు బయలుదేరింది. ఇదే సమయంలో మార్కాపురం గ్రామం నుంచి కర్నూలు వైపు వెళ్లేందుకు బొలెరో వాహనం సడన్‌గా రోడ్డుపైకి వచ్చింది. అయితే బస్సు డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించి వేగాన్ని అదుపు చేస్తూ బొలెరోను ఢీకొనకుండా తప్పించే ప్రయత్నంలో బస్సును పొలాల్లోకి తీసుకెళ్లడంతో పెను ప్రమాదం తప్పింది. అయితే రెండు వాహనాలు కొద్దిగా ఢీకొనడంతో బొలెరో డ్రైవర్ సంగల్ సాహెబ్‌కు రక్తగాయాలవ్వగా, బస్సులో ప్రయాణిస్తున్న ఇద్దరికి కడ్డీలు తగులుకొని స్వల్ప గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న కె.నాగలాపురం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు.

రజకులకు ఉచిత విద్యుత్ ఇవ్వాలి



మాట్లాడుతున్న సి.గురుశేఖర్

కర్నూలు(సెంట్రల్): రజక వృత్తిదారుల ఇళ్లకు ప్రభుత్వం 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇవ్వాలని ఏపీ రజక వృత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు సి.గురుశేఖర్ డిమాండ్ చేశారు. శుక్రవారం చాకలి ఐలమ్మ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రజక వృత్తిదారులకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన ఒక్క హామీని కూడా అమలు చేయలేదన్నారు. విద్యుత్, దేవదాయ, రజక కార్పొరేషన్లలో కమిటీల్లో ప్రాధాన్యత, కుంటలు, చెరువులకు సంబంధించి జీఓ నంబర్ 343 ప్రకారం రజక రక్షణ చట్టాన్ని తేవాలన్నారు. విశ్వకర్మ కౌసల్య యోజన పథకం ద్వారా లబ్ధి పొందిన వారికి రుణాలు, పనిముట్లు ఇస్తామని చెప్పి మోసం చేశారని విమర్శించారు. జీఓ నంబర్ 27 ప్రకారం ప్రభుత్వ శాఖల్లో దోబీ పోస్టులను భర్తీ చేయాలన్నారు. మరోవైపు రజక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి 8 నెలలు అవుతున్నా ఒక్క రూపాయి నిధులు కూడా కేటాయించలేదన్నారు. నాయకులు శేషాద్రి, సి.రాముడు, జయమ్మ, సి.శ్రీనివాసులు, శేఖర్‌బాబు, ఈరన్న, ఉరుకుందు, ఎల్లయ్య పాల్గొన్నారు.

మలేరియాను అంతమొందించాలి

కర్నూలు(హాస్పిటల్): ప్రభుత్వంతో పాటు ప్రజలు సైతం సహకరించి సమాజం నుంచి మలేరియా వ్యాధిని అంతమొందించాలని జిల్లా మాస్ మీడియా అధికారి శ్రీనివాసులు శెట్టి కోరారు. శుక్రవారం స్థానిక జొహరాపురం యూపీహెచ్‌సీ పరిధిలోని నేతాజీ నగర్‌లో మలేరియా వ్యతిరేక మాసోత్సవాల్లో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శ్రీనివాసులు శెట్టి మాట్లాడుతూ.. మలేరియా వ్యాధి గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే – డ్రైడే నిర్వహించి దోమలు పుట్టకుండా, కుట్టకుండా చేయాలని సూచించారు. నీటి నిల్వలు లేకుండా పూర్తిగా తొలగించి దోమల పెరుగుదలను అరికట్టాలన్నారు. డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, ఆరోగ్య కార్యకర్త కిరణ్, శైలజ, ఆశా కార్యకర్త వెంకటేశ్వరి పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కర్నూలు: మిడుతూరు మండలం చౌటుకూరు గ్రామానికి చెందిన విశ్వనాథ్ (23) పురుగు మందు తాగి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతిచెందాడు. ఈయన కొంతకాలంగా ఒమేగా హాస్పిటల్‌లో పనిచేస్తున్నాడు. ఈ నెల 11వ తేదీన అనారోగ్య సమస్యతో గడ్డి మందు తాగి అపస్మారక స్థితిలో పడిఉండగా స్థానికులు గుర్తించి ఆసుపత్రిలో చేర్పించారు. ఈ క్రమంలో కోలుకోలేక శుక్రవారం మృతిచెందాడు. ఒకటో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

నేడు పాణి హటి చిడాదహి మహోత్సవం

కర్నూలు కల్చరల్: ఇస్కాన్ ఆధ్వర్యంలో శనివారం పాణి హటి చిడాదహి మహోత్సవం నిర్వహించనున్నట్లు కర్నూలు ఇస్కాన్ బాధ్యులు రఘునందన సేవ ప్రభు పేర్కొన్నారు. నగర శివారులోని పాత జగన్నాథగట్టులోని జగన్నాథ స్వామి దేవాలయం ప్రాంగణంలో ఉదయం 9 గంటల నుంచి ఉత్సవాలు జరుగుతాయని పేర్కొన్నారు. కీర్తన, అభిషేకం, తిరుపతి ఇస్కాన్ ఉపాధ్యక్షుడు రూపేశ్వర చైతన్య ప్రభుజీచే ప్రత్యేక ప్రవచనం ఉంటుందని తెలిపారు. ఉదయం 8 గంటలకు కర్నూలు ఇస్కాన్ ఆలయం నుంచి బస్సులు బయలు దేరుతాయని వెల్లడించారు.

అవినీతిపై విచారణ జరపాలి

కర్నూలు(హాస్పిటల్): జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో జరుగుతున్న అవినీతిపై సమగ్ర విచారణ జరపాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసులు, నగర కార్యదర్శి బీసన్న శుక్రవారం డీఆర్‌ఓ వెంకటేశ్వర్లుకు వినతి పత్రం సమర్పించారు. 2019–2024 సంవత్సరాలకు సంబంధించి ఆడిట్ జరుగుతున్న సందర్భంగా కార్యాలయంలో కొందరు సిబ్బంది పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీ, విలేజ్ హెల్త్ క్లినిక్ సిబ్బంది నుంచి వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపణలు వస్తున్నాయన్నారు. దీనిపై సమగ్ర విచారణ జరపాలని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో నాయకులు చంటి, ఖాసీం, శరత్‌కుమార్ ఉన్నారు.